# పుస్తక సమీక్ష

పుస్తకంలేని ఇల్లు.. ఆత్మలేని శరీరం లాంటిది.

## రాజరికం- రక్తసంబంధం




**రాజరికం** రక్త సంబంధాలను కూడా చూడదు. గద్దె ఎక్కే క్రమంలో తోడబుట్టిన వారినీ కనికరించని పరిస్థితులు చరిత్రలో కనిపిస్తాయి. దీన్ని ఇతివృత్తంగా చేసుకుని సంధ్యా యల్లాప్రగడ అక్షరీకరించిన నవల 'ఘటికాపురి'. ఇది తెలుగు మాగాణాలను 300 ఏండ్లపాటు అప్రతిహతంగా ఏలిన విష్ణుకుండినుల కాలానికి సంబంధించిన చారిత్రక నవల. కథా కాలం.. మూడో మాధవవర్మ పాలన సమయం. ఈయన రెండో మాధవవర్మ, ఆయన పట్టపురాణి కొడుకు. మరో దేవేరి వాకాటక మహాదేవి సంతానమైన విక్రమేంద్ర వర్మ వృద్ధాప్యం వచ్చే వరకు యువ రాజుగానే మిగిలిపోతాడు. మూడో మాధవవర్మ కొడుకు మహాదేవవర్మ. ఇతను గనుక రాజైతే విష్ణుకుండిన సింహాసనం తనకు, తన కొడుకు ఇంద్రభట్టారక వర్మకు దక్కదని విక్రమేంద్రవర్మ నిర్ణయించుకుంటాడు. దాంతో తనకు అడ్డుగా ఉన్న మహాదేవవర్మను విష ప్రయోగం చేస్తాడు. ఘటికాపురిలో ఈ కథే ప్రధాన పాయగా సాగుతుంది. కానీ, విష్ణుకుండిన ప్రధాన గూఢచారి శ్రీకరుడు, కళావంతుల యువతి మల్లికావల్లి సఫల ప్రేమ, యువరాజు మహాదేవ వర్మ, కళింగదేశానికి చెందిన నర్తకి హరిక భగ్న ప్రేమలను సమాంతరంగా నడిపిస్తూ సంధ్యా యల్లాప్రగడ ఈ నవలను ఎంతో ఉత్కంఠభరితంగా తీర్చిదిద్దారు. విష్ణుకుండినుల చరిత్రను తెలుసుకోవడానికి 'ఘటికాపురి' నవల ఓ గవాక్షం.

### ఘటికాపురి

**రచన:** సంధ్యా యల్లాప్రగడ
**పేజీలు:** 160, **ధర:** రూ. 150
**ప్రచురణ:** అచ్చంగా తెలుగు
**ప్రతులకు:** ఫోన్: 85588 99478

... చింతలపల్లి హర్షవర్ధన్

## రేపటి కవుల కార్యశాల




**ఒక కవి** తన ఆలోచనలకు ఇచ్చే అక్షరరూపమే కవిత. అయితే, ఆలోచనలు కవితగా రూపుకట్టడానికి చాలా దశలు దాటాల్సి ఉంటుంది. ఈ క్రమంలో కవిత అనేక మార్పులు, చేర్పులకు గురవుతుంది. కొంతమంది కవుల విషయంలో ఈ ప్రయాస మనసులో జరగవచ్చు. మరికొంతమందిలో కాగితం మీద జరగవచ్చు. కాగితం మీద జరిగిన మార్పులు మనకు కొట్టివేతల్లో కనిపిస్తాయి. కవి తన భావాలకు వాక్య రూపం ఇచ్చిన తర్వాత, తరచితరచి చూసుకుంటాడు. నచ్చకపోతే పదీ పదిహేనుసార్లయినా కొట్టివేస్తాడు. కవిత ఒక రూపాన్ని ధరించే వరకు ఇలా మార్పులు చేర్పులు జరుగుతూనే ఉంటాయి. అలా గురజాడ మొదలుకుని యాకూబ్ వరకు ఎంతోమంది కవుల ప్రముఖ కవితల చిత్తుప్రతులను, వాటి పక్క పేజీల్లోనే తుది కవితలను చూపుతూ నవ చేతన పబ్లిషింగ్ హౌస్ 'పొయిట్రీ వర్క్‌షాప్' పేరుతో సంకలనంగా తీసుకువచ్చింది. సాహితీ ప్రపంచంలో ప్రవేశించడానికి కలం, కాగితం కొత్తగా కొనుక్కుంటున్న నవతరం కవులకు ఈ సంకలనం మార్గనిర్దేశం చేస్తుంది.

### పొయిట్రీ వర్క్‌షాప్

**నిర్వహణ:** ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్
**పేజీలు:** 608, **ధర:** రూ. 500
**ప్రతులకు:** నవ చేతన, విశాలాంధ్ర బుక్ హౌస్

# హెల్త్ బిట్స్



## బాల్యంలో సోడా.. పెద్దయ్యాక మద్యం?

కెఫీన్‌తో కూడిన సోడా రోజూ తాగే అలవాటు ఉన్న పిల్లలు, తర్వాత కాలంలో మద్యం తీసుకునే అవకాశాలు ఎక్కువేనట. ఈ పరిశోధన 2,000 మంది అమెరికన్ పిల్లలపై జరిగింది. వారి వయసు 9-10 ఏండ్ల మధ్య ఉంటుంది. 'సబ్‌స్టాన్స్ యూజ్ అండ్ మిస్‌యూజ్ జర్నల్'లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. రోజూ కెఫీన్ సోడా తాగే పిల్లలు భవిష్యత్తులో ఆల్కహాల్‌కు అలవాటుపడే ఆస్కారం.. ఇతరులతో పోలిస్తే రెండు రెట్లు ఎక్కువట. అంతేకాదు, వీరిలో అనాలోచితంగా ప్రవర్తించే ఇంపల్సివ్ బిహేవియర్ తీవ్రంగా ఉంటుందట. అలానే, మెదడు చురుకుదనం తక్కువ. కౌమారులు, పెద్దల్లో కెఫీన్ పానీయాలు, ఆల్కహాల్ వినియోగం మీద ఇప్పటికే పరిశోధనలు జరిగాయి. పిల్లలపై ఇదే మొదటిది. ఎనర్జీ డ్రింక్స్ తాగేవారేమో ఒకటి రెండేండ్లలోనే ఆల్కహాల్ అలవాటు చేసుకునే ముప్పు రెండు రెట్లు ఎక్కువట. కెఫినేటెడ్ సోడాలు మెదడు మీద ప్రభావం చూపడమే దీనికి కారణం. ఇదే తర్వాత తర్వాత ఆల్కహాల్‌కు బానిసను చేస్తుందట.

## పనివేళల్లో పట్టువిడుపులు

పనివేళల్లో కొద్దిపాటి వెసులుబాట్లు ఉద్యోగుల్లో గుండె కవాటాల వ్యాధుల ముప్పును తగ్గిస్తాయట. హార్వర్డ్ టి.హెచ్.చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ పెన్ స్టేట్ యూనివర్సిటీ అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. పని, వ్యక్తిగత, కుటుంబ జీవితాల మధ్య సమతౌల్యం ఒత్తిడిని దూరం చేస్తుందని, గుండెను ఆరోగ్యంగా ఉంచుతుందని తేలింది. ఈ మార్పులు ఐదు నుంచి పదేండ్ల వరకు ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా వ్యాధుల ముప్పు ఎక్కువగా ఉండే సీనియర్ ఉద్యోగుల విషయంలో ఈ తరహా నిర్ణయాలు మంచి ఫలితాలను ఇస్తాయట. అల్పాదాయ, మధ్య శ్రేణి ఉద్యోగుల విషయంలో ఇది మరింత ప్రయోజనకరమని నిపుణులు నిర్ధారించారు.

## పిల్లలపై యాంటీబయాటిక్స్ ప్రభావం

పిల్లలకు రక్తంలో ఇన్ఫెక్షన్, మెదడులో ఇన్‌ఫ్లమేషన్ చికిత్స కోసం యాంటిబయాటిక్స్ ఉపయోగిస్తారు. అయితే, ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని చాలా ప్రదేశాల్లో యాంటీబయాటిక్స్ పిల్లల మీద అంత ప్రభావం చూపలేకపోతున్నాయట. దీనికి యాంటీబయోటిక్స్ నిరోధకతే కారణమట. ఆస్ట్రేలియా, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాల పరిశోధకుల అధ్యయనంలో ఈ విషయం తేలింది. ఈ విషయం లాన్సెట్ ఆగ్నేయాసియా జర్నల్‌లో ప్రచురితమైంది.